# రక్తపు మరకలు

కోడి కుయ్యగానే వెంకటయ్యకు మెలకువ వచ్చింది. దొడ్లో ఆవు మెడకు కట్టిన మువ్వలు వినపట్టంలేదు. వెంకటయ్య ఉలిక్కిపడి లేచాడు–కుక్కి మంచంలో నుంచి. మంచానికి ఆనించి పెట్టుకున్న కర్రచేత్తో తీసుకొని, కిర్రు చెప్పుల్లోకి కాలుదూర్చి, గొడ్ల చావిడిలోకి నడిచాడు. గొడ్ల చావిడి ఇంకా చీకటిగానే వుంది. ఆవు మెడకుకట్టిన మువ్వలు వినపట్టంలేదు. భయంకరమైన నిశ్శబ్దం. చీకటిని చీల్చుకొని చూశాడు. కట్టుగొయ్య దగ్గర ఆవులేదు. అతని గుండె గుభేలు మన్నది. పలుపు తెంపుకొని ఎక్కడికో వెళ్ళింది ఆవు. ఎక్కడికి వెళ్ళి వుంటుంది?

మొదట్లో విడిచిపెట్టినా చావిడి విడిచేది కాదు ఆవు. రాత్రిళ్ళు తిరగటం తానే నేర్పాడు ఆవుకి. తనకు ఆ ఆవంటే ఎంతో ప్రాణం. అది బలిసి నిగనిగ లాడుతూ వుండాలని అతని అపేక్ష. కాని దాన్ని తా నెంతని మేపగలడు! అందుకని రాత్రిళ్ళు తానే విడిచిపెట్టేవాడు–దొంగతిండి తిని రమ్మని మొదట్లో యజమాని అభిప్రాయం ఆ ఆవు గ్రహించలేక పోయింది. మెడనుంచి పలుపు ఊడదీసినా కదలకుండా అలాగే నిలబడేది. చావిడిలో నుంచి, బయటకుతోలి తలుపువేస్తే, “అంబా, అంబా” అని అరుస్తూ తలుపు దగ్గరే నిలబడి వుండేది. నెమ్మది నెమ్మదిగా తానే అలవాటు చేశాడు–ప్రక్కనున్న పొలాల్లో మెయ్యటం. ఆవు దొంగమేత రుచి మరిగి ది. పలుపు విప్పగానే తోక పైకెత్తి బయటకు పరుగెత్తేది. రాత్రులంతా ఎక్కడెక్కడో మేసి, తెల్లవారక ముందే సంగనాచికిమల్లే వచ్చి కట్టుగొయ్య దగ్గర నిలబడేది తాను లేచి బురద తుడిచి కట్టివేశేవాడు.

తెల్లవారి ఎవ్వరైనా ఈ రాత్రి ఏ దొంగ గొడ్డో మా చేలోపడి మేసిపోయిందని దుమ్మెత్తి పోస్తుంటే–“ఊరుకో, జరిగిందానికి ఏం చేస్తాం? ఇంతకీ రోజులు మారిపోయినై. ఎవ్వరినని అంటాం?” అనేవాడు.

ఇలా పట్టుబడకుండా జరిగింది కొన్నాళ్ళు. చేసేపనిని బట్టి ఆ ఆవు కూడా అనేక పోకిళ్ళు నేర్చుకుంది.

రోజులు గడిచి పోతున్నాయి. ఒకనాడు వీరయ్య అనే రైతుకాపేసి రాత్రి దొంగమేతకు వచ్చిన ఆవును పట్టుకున్నాడు. వెంకటయ్య ఇంటికి తోలుకువచ్చి, వెంకటయ్యనూ అతని భార్యనూ లేపాడు. నోటికివచ్చిన తిట్లన్నీ తిట్టాడు. ఏమీ అనలేక వెంకటయ్య "నేను గట్టిగా కట్టేశానయ్యా, అదే తెంపుకుపోయింది" అన్నాడు.

"అదే తెంపుకుపోయిందీ. సరే ఈసారి చేలో పడనియ్, కాళ్ళు విరగగొట్టి మాదిగింటికి తోలుతాను—దానితాత ఎవ్వడు అడ్డం వస్తాడో" అన్నాడు వీరయ్య.

ఆనాటినుంచీ ఆవుని కట్టివేసేవాడు వెంకటయ్య. రాత్రిళ్ళు దొంగ మేతకు విడిచిపెట్టేవాడుకాదు. కాని అలవాటుపడ్డ ప్రాణం అదెక్కడ వూరుకుంటుంది! అప్పుడప్పుడూ తెంపుకుపోతూ వుండేది, తెల్లవారేపాటికి కట్టుగొయ్య దగ్గరకు వచ్చి నిలబడి వుండేది.

మరి ఇప్పుడేమైనట్లు? తెల్లవార వచ్చినా పశువు తిరిగిరాలేదు. వెంకటయ్యకు అనుమానం కలిగింది. ఇంట్లోకి వెళ్ళి భార్యను లేపాడు. జరిగింది చెప్పాడు.

"ఊఁ, నామాట మొదటే వింటే" అన్నది ఆవిడ.

"ఏమాటే?" అన్నాడు వెంకటయ్య.

"ఆమాటే, రాత్రిళ్ళు దాన్ని విడిచి పెట్టొద్దంటే నామాట విన్నావ్? దానికి నువ్వే దొంగమేత నేర్పితివి నేర్చుకుంది. ఇప్పుడు మానుకోమంటే మానుతుందా? అనుభవించు" అన్నది, మళ్ళీ పడుకుంది.

వెంకటయ్యకు ఏమీ తోచలేదు. కళ్ళల్లో వొత్తులు పెట్టుకుని తెల్లవారేదాకా కూర్చున్నాడు. తెల్లవారగానే ఆవును వెతుక్కుంటూ బయలుదేరాడు. ఎక్కడుంది? ఊరు వెతికాడు, చేలు వెతికాడు, ఆవుజాడలేదు. తిరిగి వొస్తుంటే పెదసుబ్బయ్యగారి చిన వెంకయ్య కనిపించాడు.

"ఏమే, ఎక్కడనుంచి?" అన్నాడు చిన వెంకయ్య.

"గొడ్డు కనపడలేదురా అబ్బాయి" అన్నాడు.

"ఆవేనంటే?"

"అవునురా అబ్బాయి."

"నేనిటు వొస్తుంటే మన బుచ్చిగాడు నీ ఇంటిముందు నుంచుని నానా బండబూతులూ కూస్తున్నాడు. రాత్రి వాడి చేనంతా దొంగ గొడ్డేదో మేసి పోయిందట. నీ ఆవేనేమో" అన్నాడు చిన వెంకయ్య.

ఈ మాటల్తో వెంకటయ్య మనస్సు గతుక్కుమంది. గబగబా ఇంటికి వెళదాం అనుకున్నాడు కాని మొహం చెల్లలేదు. అసలే బుచ్చిగాడి నోరు మంచిదికాదు. తను కంట పడితే ఏమేమికూస్తాడో! ఎన్ని అనరాని మాటలు అంటాడో! ఊళ్ళోకి వెళ్ళకుండా, ఏదో పని వున్నవాడికిమల్లే చేనుదగ్గరకు వెళ్ళాడు, గట్టుమీద కూర్చున్నాడు. కళ్ళవెంట నీళ్ళుతిరిగినై. తన ఆవు స్వభావసిద్ధంగా అతి నీతి గలిగిన గొడ్డు. దాని మనస్సుని తనే మార్చాడు. ఇప్పుడది తన వశం తప్పింది. తను గ్రామస్థులకు మొహం చూపేది ఎలా? చూపక చేసేది యేముంది? అన్నపు వేళకు యింటికి బయలు దేరాడు. ఇల్లు బావురుమంటూ వుంది.

"ఏమే?"

"ఒచ్చా!" అన్నది భార్య. "దానితోపాటు నువ్వూ పోయావేమో అనుకున్నా"

"ఏమయిందే?" అన్నాడు వెంకటయ్య.

"ఇంకేం అవ్వాలి? ఆ బుచ్చయ్య యింత నోరు చేసుకువచ్చి ఇంటిమీద పడ్డాడు. రాత్రి వాడి చేను ఏదో గొడ్డు మేసిపోయిందట. అది మనదేనట. ఊళ్లో పెద్దమనుష్యులందర్నీ తీసుకువచ్చిపంచాయితీపెట్టాడు."

"ఏమన్నారే?"

"పదిరూపాయలు కట్టమన్నారు వాడి యెదాన"

"ఇంతకీ గొడ్డెక్కడుందే?"

"ఏమో యెక్కడుందో"

వెంకటయ్య మాట్లాడకుండా వెళ్ళిపడుకున్నాడు—కుక్కిమంచంలో. తన ఆవు కళ్ళల్లో మెదిలింది.

"ఒసేయ్" భార్యను పిలిచాడు.

"ఏం?"

"కోడిగుడ్లూ, పెరుగూ అమ్ముతుంటివిగదే, ఆ డబ్బు ఎక్కడ పెట్టావ్?"

"తీసుకువెళ్ళి వాడి యెదాన వేసి వస్తావా?" అన్నది భార్య.

"మరి గొడ్డును తోలుకొచ్చుకోవాలి గదే"

"ఏమో, ఏం చేస్తావో! నన్ను మాత్రం అడక్కు" అన్నది భార్య.

వెంకటయ్య భార్యకు నయానా భయానా చెప్పి చూశాడు. కాని ఆమె వినలేదు. "ససేమిరా అంటే ససేమిరా"అంది. "ఇస్తావా, ఇవ్వవా?" అన్నాడు వెంకటయ్య వొళ్ళు తెలియని కోపంతో.

"ఇవ్వను" అన్నది భార్య.

కోపం పట్టలేకపోయాడు వెంకటయ్య. చెంపమీద పెడేలున ఒక్కటి వేశాడు. తన భార్య డబ్బు ఎక్కడదాచేదీ అతని తెలుసు. ఉట్టిమీద వున్న పిడతతీసి, డబ్బులు తీసుకొని బుచ్చయ్య ఇంటికి వెళ్ళాడు. అతను నోరు చేసుకుంటూ వుంటే ఈసారికి తప్పుకాయమని ప్రాధేయపడ్డాడు. బొడ్డువిప్పి పదిరూపాయలూ సమర్పించుకున్నాడు. ఆవు బందెలదొడ్లో వుందని తెలుసుకున్నాడు. అక్కడ కట్టవలసిన డబ్బు కట్టి ఆవుని తోలుకొచ్చుకోటానికి లోపలకు వెళ్ళాడు. తన ఆవును చూచి నిలువుగుడ్లువేసి నిల్చబడ్డాడు. ఆవు ఒంటినిండా రక్తపు మరకలే. దుర్మార్గుడు బుచ్చయ్య గొడ్డుని చావమోదాడు. అతని కళ్ళల్లో నీళ్ళు తిరిగినై: ఆవు పసికట్టినట్టుంది. గిరుక్కున తిరిగింది. యజమానిని చూచింది. "అంబా" అని అరిచింది ఒక్కసారి. ఆ అరుపు బాకులా దిగబడింది వెంకటయ్య హృదయంలోకి. కండ్లవెంట బొటబొట కన్నీరు కారుస్తూ "తప్పునీదికాదు-నాది. నా పాపం నువ్వు మోస్తున్నావు. వచ్చే జన్మకు నీ బిడ్డనై పుట్టి నీ ఋణం తీర్చుకుంటాను" అన్నాడు-ఆవుమేను నవరిస్తూ. ఆవు తెలుసుకున్నట్లే తనూ కన్నీరు కార్చింది.